శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# ముఖ్యమంత్రిని సన్మానించిన పోలంరెడ్డి



**కోవూరు, నవంబం19ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎంపికైన పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి శాలువా, బుద్ధుని విగ్రహంతో ప్రత్యేకంగా అభినందించారు. గురువారం జరిగే ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఆయన దినేష్‌రెడ్డిని ప్రత్యేకంగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

## లోకేష్‌ని కలిసిన పోలంరెడ్డి




**కోవూరు నవంబర్ 19 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్‌గా ఎంపికైన పోలంరెడ్డి దినేష్‌రెడ్డి , ఆయన తండ్రి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి విద్యాశాఖా మంత్రి నారాలోకేష్‌ని మంగళగిరి కార్యాలయంలో కలిశారు. తన ప్రమాణస్వీకారానికి హాజరు కావాలని మంత్రి లోకేష్‌ని ఆహ్వానించారు. మంత్రి లోకేష్ ఎంతో ఆప్యాయతగా దినేష్‌రెడ్డిని పలకరించి ఆలింగనం చేసుకున్నారు.

## రోడ్లు, భవనాలశాఖమంత్రిని కలిసిన కావలి ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, నవంబర్19 ప్రభాతవార్త** రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖామంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కలిశారు. విజయవాడలో మంత్రినికలిసి కావలి నియోజకవర్గంలోని పలుసమస్యలను ఆయనదృష్టికి తీసుకువెళ్లారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రిని ఎమ్మెల్యే దగుమాటికోరారు. మంత్రి జనార్ధన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్‌ను కలిసిన ఆర్య వైశ్యనేతలు



**కావలి, నవంబర్19 ప్రభాతవార్త** ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండిరాకేష్‌ను విజయవాడలోని ఆయన కార్యాలయంలో కావలి ఆర్యవైశ్య నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరక్టర్ తటవర్తివాసు, కావలి ఆర్యవైశ్యసంఘం ట్రెజరర్ ఒరుగంటి రామకృష్ణ, మంచిగంటి మురళి, మిద్దె ప్రతాప్‌లు కలిసి అభినందనలు తెలిపారు.

## మార్చి 25 నాటికి నూరుశాతం నిర్మాణాలు పూర్తికావాలి




**కోవూరు, నవంబం19ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని గాంధీ గిరిజన సంఘం లేఅవుట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను మంగళవారం గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ టి. వేణుగోపాల్ నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రూఫ్ శ్లాబ్‌లో ఉన్న గృహాలు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా మిగిలిన గృహాలు నూరుశృాతం మార్చి 25 నాటికి పూర్తి కావాలన్నారు. లబ్దిదారులు పొదుపు గ్రూపుల ద్వారా రుణాలు తీసుకుని నిర్మాణాలను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తయ్యేలా సహకరించాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణాల విషయంలో అలసత్వం ప్రదర్శించకుండా నూరుశాతం లక్ష్యాలు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవయ్య, తదితరులు ఉన్నారు.

## టీడీపీ మ్యానిఫెస్టో లో ఇచ్చిన హామీలు నెరవేర్చండి

### ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, నవంబర్ 19, ప్రభాతవార్త** ఏపీ శాసనమండలి సమావేశాలలో హై స్కూల్ ప్లస్‌లలో ఇంటర్మీడియట్‌ను బోదించేందుకు స్కూల్ అసిస్టెంట్ లకు ప్రమోషన్లు ఇచ్చి పూర్తి స్థాయిలో పీజీటీలను ఏర్పాటు చేయాలని శాసన మండలిలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌లు బలోపేతం కావాలంటే, పేద పిల్లలకు నాణ్యమైన ఇంటర్ మీడియట్ విద్య అందాలంటే... తప్పనిసరిగా పిజిటి హోదా తో పని చేసే ఫుల్ టైంఅధ్యాపకులు అవసరం ఉంది. కాబట్టి సంబంధిత మానేజ్మెంట్ స్కూల్స్ లోని స్కూల్ అసిస్టెంట్స్‌కు ప్రమోషన్లు కల్పిం చి పూర్తి స్థాయి పిజిటిలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు టీడీపీ తమ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే 23 శాతం కంటే తక్కువ లేకుండా ఐఆర్‌ని ప్రకటించాలని కోరారు.

## ఏకవల్య పాఠశాల ప్రిన్సిపాల్ సరెండర్



**కొడవలూరు(విడవలూరు), నవంబర్ 19, ప్రభాతవార్త** మండలం చంద్రశేఖరపురం ఏకవల్య గురుకుల పాఠశాలలో సమస్యలు, విద్యార్థులు అతిసారం, అస్వస్థత నేపథ్యంలో స్థానిక ప్రిన్సిపాల్ విష్ణు ప్రతాప్ శుక్లాను సరెండర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు మంగళవారం జారీ చేసింది. ఆయన స్థానంలో శ్రీకాళహస్తి ఏకవల్య పాఠశాల లెక్చలర్ విష్ణు ప్రియను నియమించారు.

## అమెరికాలో కప్పు సాధించిన సంఘం చిన్నారి




**సంగం నవంబర్ 19 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంకి చెందిన వాగిచర్ల రోహిణ్‌కుమార్ అమెరికాలో ఫ్లోరిడా స్టేట్‌లో జరిగిన పుట్‌బాల్ పోటీలలో కప్పును సాదించాడు. అక్కడ రాష్ట్ర స్దాయిలో జరిగిన పోటీలలో 6 వ క్లాస్ చదువుతున్న రోహిణ్‌కుమార్ ఎంతో ప్రతిభ కనబరచి ఈకప్పును సాధించాడు. ఈ సందర్భంగా రోహిణ్ తల్లిదండ్రులు, తాత గునుపూడి గిరి హర్షం వ్యక్తం చేశారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, నవంబర్19ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 4000 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో70.565టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 400, ఎన్‌ఎఫ్‌సికి 700, పెన్నా డెల్టాకు 50, కండలేరు వరద కాలువకు2600 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.564మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# ఆరోగ్యకరమైన భవిష్యత్ కు మరుగుదొడ్ల వినియోగం పునాది




**నెల్లూరు అర్బన్, నవంబర్ 19, ప్రభాతవార్త** మరుగుదొడ్లను వినియోగించుకోవడం గ్రామీణ ప్రజల గౌరవాన్ని కాపాడటమే కాకుండా ఆరోగ్యపరంగా పెనుమార్పులకు కారణమవుతుందని జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ పేర్కొన్నారు. ప్రపంచ టాయిలెట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా త్రాగునీరు, పారిశుధ్య మిషన్ జిల్లా స్థాయి సభ్యుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఇ వెంకట రమణ కార్యక్రమ ఉద్దేశం గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో, ప్రతి గ్రామంలో మరుగుదొడ్లు ఉండేవిధంగా ప్రజలందరూ ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లను వినియోగించుకోవడం గ్రామీణ ప్రజల గౌరవాన్ని ముఖ్యంగా మహిళల గౌరవాన్ని కాపాడటమే కాకుండా ఆరోగ్యపరంగా వారి జీవితాల్లో పెనుమార్పులకు కారణమవుతుందన్నారు. పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్ కు మరుగుదొడ్ల వినియోగం పునాది లాంటిదన్నారు. ఆరోగ్యంగా బాగుండాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. జిల్లాలో బహిరంగ బహిర్భూమికి ఎవరూ వెళ్లకూడదనే లక్ష్యంతో ఉండాలన్నారు. వ్యక్తిగత , సామాజిక మరుగుదొడ్ల వినియోగంపై డిసెంబర్ 10వ తేదీ వరకు జిల్లాలో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే నిర్మించి వినియోగంలో లేని వాటిని గుర్తించి, మరమ్మత్తులు చేసి, ఉపయోగించుకునే విధంగా ప్రజలను చైతన్యపరచాలన్నారు. అదేవిధంగా సామాజిక మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకుని, అందంగా రంగులతో అలంకరించి సక్రమంగా నిర్వహిస్తున్న పంచాయతీలను గుర్తించి ఉత్తమ పురస్కారాలు అందజేస్తామన్నారు. వ్యక్తిగత స్థాయిలో కూడా పురస్కారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన కొందరికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మరుగుదొడ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో డిపిఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ బాలాజీ రావు, జెడ్పి సిఇఓ మోహన్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సత్ఫలితాలనిస్తున్న మొబైల్ హంట్.. జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్..

## 700 మొబైల్ ఫోన్లో రికవరీ..

### బాధితులకు అందజేత




**నెల్లూరు క్రైమ్, నవంబర్ 19, ప్రభాత వార్త:** దొంగిలించబడిన, ప్రమాదవశాత్తు పోగొట్టుకోబడిన మొబైల్ ఫోన్లను తిరిగి బాధితులకు అప్పగించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన మొబైల్ హంట్ సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయని జిల్లా ఎస్పీ జీ కృష్ణ కాంత్ తెలిపారు. స్థానిక ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు రూ. 1.50 కోట్లు విలువచేసే 700 మొబైల్ ఫోన్లను పలు సందర్భాల్లో పోగొట్టుకున్న బాధితులకు ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మొబైల్ అంత అప్లికేషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు రూ. 8 కోట్ల విలువచేసే మూడు వేలకు పైగా మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. ఫోన్ పోగొట్టుకున్న, దొంగిలించబడిన ఆందోళనకు గురికాకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా మొబైల్ హంట్ సేవలను 9154305600 నెంబర్ కు వాట్సప్ చేయడం ద్వారా ఉపయోగించుకోవాలని సూచించారు. సరైన బిల్లులు లేని ఫోన్లను, తెలియని వారి నుండి సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనవద్దని సూచించారు. ఫోన్లను రికవరీ చేయడంలో ప్రతిభ కనపరిచిన సైబర్ క్రైమ్ అనాలసిస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా బాధితులకు స్వయానా ఎస్పీ



మొబైల్‌లను అందజేశారు. పోయిన మొబైల్స్ తిరిగి ఇచ్చిన జిల్లా ఎస్పీకి, పోలీస్ శాఖకు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ సిహెచ్ సౌజన్య, నెల్లూరు నగర, రూరల్ డిఎస్పీలు శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఊపిరి పిలుచుకున్న గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులు



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 19, ప్రభాతవార్త** మూడు రోజుల నుండి ఏకవల్య గిరిజన గురుకుల పాఠశాల41 మంది విద్యార్థుని విద్యార్థులు కలుషిత నీటి వలన వాంతులు, విరోచనాలతో అస్వస్థతకి లోనయ్యారు. ఆదివారం ఈ సంఘటన జరగటం విషయాన్ని బయటకు రానీయకుండా ప్రిన్సిపాల్ గోప్యంగా ఉంచారు. దీంతో అతిసారం ప్రభలమైంది విద్యార్థులు ఒకరి తర్వాత ఒకరు వ్యాధిన పడ్డారు. ఆలస్యంగా సోమవారం నాటికి వెలుగులోకి రావడం విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అర్ధరాత్రి సమయంలో గురుకులంలో పరిశీలన చేసి విద్యార్థులకు అవసరమయ్యే చికిత్సను అందించాలని జిల్లా కలెక్టర్‌తో సంప్రదించి డిఎం అండ్ హెచ్ఓకు ఆదేశించారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మంగళవారం గురుకుల పాఠశాలను పర్యవేక్షించి కలుషిత నీరు తాగి విద్యార్థులు అస్వస్థకు గురైన విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, అనేక సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం జరిగింది. తాగే నీరు కలుషితం, తినే ఆహారం ఆలస్యం కాల కృత్యాలు మరుగుదొడ్లు కరువు మరి విద్యార్థులు ఎలా ఉండాలని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 800 మంది ఉండాల్సిన విద్యార్థులకు గాను ఈరోజు 430 మంది విద్యార్థులకు చేరుకుంది. దీనికి కారణం మౌలిక సదుపాయాలు లేక పనిచేసే సిబ్బంది నిర్లక్ష్య వైఖరి కారణమన్నారు. మధ్యాహ్న భోజనం రెండు గంటల 30 నిమిషాలకు కూడా అందించకపోవడం దారుణమైన సంఘటనని ముఖ్యంగా ప్రిన్సిపాల్ పాఠశాలలో ఇతర రాష్ట్రాలను వచ్చిన సిబ్బంది కావడంతో భాష అర్థం విద్యార్థినీ విద్యార్థులు తికమక పడుతున్నారు. స్థానిక



ఎమ్మెల్యే ప్రిన్సిపాల్‌కు సూచనలు ఇచ్చిన పట్టించుకోలేదు ప్రజా ప్రతినిధులతో మాట్లాడే వైఖరి కూడా తెలియకుండా పోయింది. ప్రజా నాయకులు ప్రతినెల ఒక రోజు గురుకులంలో కేటాయించి ముందుకు రావాలని కోరారు. జిల్లా గిరిజన నాయకులు కేసి పెంచలయ్య, కొమరగిరి దయాకర్, చలంచర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాళ్లపాడు ప్రాజెక్టు సమస్యలపై మాట్లాడిన ఎమ్మెల్యే ఇంటూరి

**లింగసముద్రం , నవంబర్ 19, ప్రభాతవార్త** రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో కందుకూరు ప్రజల జీవనాడి రాళ్లపాడు ప్రాజెక్టు సమస్యలపై కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తొలిసారి అసెంబ్లీలో మంగళవారం మాట్లాడారు. కందుకూరు నియోజకవర్గం ప్రజల జీవనాడి రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల ప్రాజెక్టు నుంచి గొట్టిపాటి కొండపనాయుడు ఉత్తర కాలువ ద్వారా 1.5 టీఎంసీలు నీరు రాళ్లపాడు ప్రాజెక్టుకు రావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఆ కాలువలో నీటిపారుదల సరిగా లేక 0.5టీఎంసీ నీరు కూడా ప్రాజెక్టుకి చేరడం లేదన్నారు. పూర్తి స్థాయిలో నీరు రాక కందుకూరు నియోజకవర్గం రైతాంగం పంటలు పండించేందుకు ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. రాళ్లపాడు ప్రాజెక్టు సంబందించిన 2018 వ సంవత్సరంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మా స్వగ్రామమైన బడేవారిపాలెం పర్యటనలో రాళ్లపాడు ఎడమ కాలువ పనులకు సంబంధించిన జీవో నెంబరు 116 ద్వారా ఎడమ కాలువ పొడిగింపు పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఎడమ కాలువ పనులు పూర్తి అయితే వలేటివారిపాలెం మండలం లింగసముద్రం మండలంలోని వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని తెలిపారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులపై ఎటువంటి పురోగతి లేదని ధ్వజమెత్తారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారం ఉన్నప్పుడు రాళ్లపాడు ప్రాజెక్టును డీప్ ఇరిగేషన్ పథకంలో ప్రాజెక్టు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కానీ గత ప్రభుత్వంలో ప్రాజెక్టును పూర్తి గా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. ప్రాజెక్టు అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రిని నాగేశ్వరరావు కోరారు. ముందుగా తనకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కల్పించిన నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు నారా లోకేష్, కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.



## కోవూరు నియోజకవర్గంలో టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేయాలి

### నేతన్న సమస్యలపై అసెంబ్లీలో కోవూరు ఎమ్మెల్యే



**కోవూరు, నవంబం19ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలైన పాటూరు, గుమ్మలదిబ్బ, కోవూరు, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల్లో చేనేతలు అధికంగా ఉన్నారని, గత ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకోవడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం నేతన్నల సమస్యలపై అసెంబ్లీలో తమ గళాన్ని వినిపించారు. నియోజకవర్గంలో వ్యవసాయం తరువాత అధిక ఉపాధిని కల్పించే చేనేత రంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వివరించాలన్నారు. ముఖ్యంగా ఐటీ శాఖ మంత్రి లోకేష్‌బాబు ప్రాతినిధ్యం వహించే మంగళగిరిలో చేనేతలకు సంబంధించి నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేశారని, అటువంటి వాటిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే ప్రతిభ ఉందా అని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఒకవేళ అటువంటి వెసులుబాటు ఉంటే కోవూరు నియోజకవర్గానికి కల్పించాలని ఈ సందర్భంగా విన్నవించారు. అదేవిధంగా చేనేత కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించే దానిపైచ ఆలోచించాలని ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోలేదని, అర్హత కలిగిన వారిని పక్కనబెట్టి అనర్హులకు పథకాలు అమలు చేసి అర్హులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేతలకు మేలు జరిగేలా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. అప్కో షోరూమ్‌లను ప్రారంభిస్తున్నామని, బిర్లా కంపెనీతో చర్చించి ఐదు జిల్లాల్లో క్లస్టర్ ఏర్పాటుకు వారు ముందుకు వచ్చారన్నారు. వీవర్స్ శాలలు ఏర్పాటుకు సంబంధించి ఇద్దరు పార్లమెంట్ సభ్యులు ఆయా జిల్లాల్లో ఏర్పాటుకు ముందుకు వచ్చారని, ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు.

## ఏసీబీ వలలో ఉప ఖజానా అధికారి



**ఉదయగిరి, నవంబర్ 19, ప్రభాతవార్త** అదనపు సంపాదన కోసం ఉద్యోగస్తులను వేదిస్తున్న అవినీతి తిమింగళాన్ని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఉదయగిరి కార్యాలయ ఖజానా అధికారి మమతను రూ.40వేలు లంచం డిమాండ్ చేసిన నేపథ్యం లో మంగళవారం నెల్లూరు ఏసీబీ డీఎస్పీ ఎన్.శిరీష తమ సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. వెంగయ్య అనే ఉపాధ్యాయుడికి తన అరియర్స్ బిల్లులు చేసేందుకు రూ.40వేలు డిమాండ్ చేయడంతో ఆయన ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ముందస్తు పథకం ప్రకారం కాపలాగాల్సిన ఏసీబీ అధికారులు పవన్ అనే వ్యక్తికి ఖజానాధికారి రూ.40వేలు అందజేయాల్సిందిగా సూచించడంతో పవన్ అనే వ్యక్తి డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ శిరీష విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలందరూ ఏసీబీ టోల్ ఫ్రీ నెంబరు అందరూ 14400 అనుకుంటున్నారని, కాదని ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే కాల్ సెంటర్ నెంబర్ 9440440057 లేకపోతే తన ఫోన్ నెంబరుకు 9440446184 కు సమాచారం అందించాలని కోరారు. ఎస్‌టీఓ ను అదుపులోకి తీసుకుని దస్త్రాలు పరిశీలిస్తున్నామని ఆమె తెలిపారు.

## సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



**సైదాపురం, నవంబర్ 19, ప్రభాతవార్త :** వరి సాగు చేసే రైతులు రసాయనిక ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారిణి హైమావతి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గులించర్ల గ్రామ రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ శాఖకు సంబందించిన అనుబంధ శాఖలతో ఆమె గ్రామ సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయం, తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న తదితర పథకాలపై ఆమె రైతులకు వివరించారు. వరి పంటలో ఎటువంటి చీడపీడలు సోకిన వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఉపాధ్యక్షులు నలమారు వెంకటేశ్వర్లురెడ్డి, స్వర్ణ విజయ్‌కుమార్‌రెడ్డి, పాలూరు గోపాల్, పాలూరు భాస్కర్, స్వర్ణ కోటారెడ్డి, వెంకటకృష్ణ యాదవ్, వ్యవసాయ సహాయకులు సాయి, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోటీ తత్వం ఉండాలి లైబ్రేరియన్ నిరూప



విడవలూరు, నవంబర్ 19, ప్రభాతవార్త : మండల గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు లైబ్రేరియన్ నిరూప ఆధ్వర్యంలో అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్, జడ్పీ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులకు రంగ వల్లిక, చిత్రలేఖనం, వ్యాసరచన, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంరక్షణ అధికారిని రమ్య మాట్లాడుతూ బాల్యవివాహాలు వాటి వలన కలిగే నష్టాలు తెలుసుకోవాలని విద్యార్థినిలకు సలహాలు సూచనలు అందించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్జీవో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు దుక్కిలో ఎరువులు వాడాలి



**విడవలూరు, నవంబర్ 19, ప్రభాతవార్త :** మండలం ముదివర్తి, వావిళ్ళ గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి నాటే ముందు దుక్కిలో ఎరువులు తప్పనిసరిగా వాడాలి తద్వారా నాటిన వరి సురక్షితంగా ఉంటుందన్నారు. అలాగే కలుపు నివారణకు సలహాలు సంప్రదింపులు చేసినట్లయితే తగిన మందులు వాడడం వలన నివారణ చెందుతుంది. ఈ కార్యక్రమంలో రైతులు, వివోలు తదితరులు పాల్గొన్నారు.

## పని కల్పించాలంటు ఎండిఒకి వినతి



**సీతారామపురం నవంబర్ 19 ప్రభాతవార్త :** జాతీయ ఉపాధీ పథకంలో తమకు పనులు కల్పించాలంటు మండలంలోని పోలం గారిపల్లి గ్రామానికి చెందిన కూలీలు ఎంపిడిఒ ఎం బాస్కర్‌ని కోరారు. మంగళ వారం పోలంగారి పల్లి గ్రామానికి చెందిన సుమారు 70 మంది కూలీలు ఉపాధికల్పించాలంటు ఎంపిడిఒకి వినతి పత్రాన్ని సమర్పించారు. తాము కొన్ని దినాలే పనిచేయగా ఆన్‌లైన్‌లో ఎక్కువ దినాలు పనిచేసినట్లు చూపించడం తమ పాలిట శాపంగా మారిందని కాబట్టి అధికారులు స్పందించి తమకు పనులు కల్పించాలని గ్రామస్తులు కోరారు. అందుకు ఎంపిడిఒ స్పందిస్తు విచారణ జరిపి త్వరలో పని కల్పిస్తామంటు హామి ఇచ్చారని రైతులు పేర్కొన్నారు.

## నేడు ఉచిత పశు వైద్య శిబిరం



**విడవలూరు, నవంబర్ 19, ప్రభాతవార్త :** మండల కేంద్రం పశు వైద్యశాలలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కోవూరు సహకారంతో పశు సంవర్ధక శాఖ అధర్వంలో ఉచిత పశు వైద్యశాల శిబిరం నిర్వహించడం జరుగుతుందని అసిస్టెంట్ డైరెక్టర్ సబ్ డివిషనల్ డాక్టర్ కృష్ణ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. పశువులలో పునరుత్పత్తి సమస్యలైనా గర్భం కలగక పోవడం, తిరిగి పొర్లడం, గర్భకోశ వ్యాధులు, గర్భస్రావాలు కలిగించే అంటువ్యాదులు గుర్తించి చికిత్సలు చేయబడును రైతులకు మేలైన జాతి దూడల పెంపకం గుర్తించి బహుమతులు ఇవ్వడం జరుగుతుంది. ప్రతి రైతు శిబిరంలో పాల్గొనాలని కోరారు.

## విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



**చేజర్ల నవంబర్ 19 ప్రభాతవార్త :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా చేజర్లలోని మానస ప్రవేటు పాఠశాలలో విద్యార్ధులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం మానస పాఠశాలలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్ధిని విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి గ్రంథాలయ వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కల్పన, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్ధులు పాల్గోన్నారు.

## ఆంజనేయ స్వామికి పూజలు



**విడవలూరు, నవంబర్ 19, ప్రభాతవార్త :** మండలం పార్లపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామికి మంగళవారం కార్తీక మాస విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ఆకుమాల, వడమాల, తులసి మాలలతో అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని జై హనుమాన్ జై హనుమాన్ టు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు ఉదయకర్తలుగా ఆలయ సేవకులు వ్యవహరించారు.

## ఘనంగా కెనరా బ్యాంక్ 119వ వ్యవస్థాపక దినోత్సవం



**అనుమసముద్రంపేట, నవంబర్19ప్రభాతవార్త:** ప్రభుత్వరంగ కెనరాబ్యాంక్ 119 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మండల కేంద్రమైన ఏఎస్‌పేట కెనరాబ్యాంక్ బ్రాంచ్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంక్ వ్యవస్థాపకులు దివంగత అమ్మెంబాల్ సుబ్బారావ్‌పాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బ్యాంక్ 119 సం వత్సరాల సుదీర్ఘ ప్రయాణాన్ని విజయ వంతంగా పూర్తిచేసుకోవడంలో ఖాతాదారుల పాత్ర అమోఘమైందని బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావ్ పేర్కొన్నారు. ఎల్లప్పుడూ కస్టమర్ల కు రుణపడి ఉంటామన్నారు. కస్టమర్లకు మరింత మెరుగైనసౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది కె.సి.బి.చక్రవర్తి, దీప్తి ఒజి, లక్ష్మీనారాయణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలి



**గుడ్లూరు, నవంబర్ 19, ప్రభాతవార్త :** మండలంలోని గుండ్లపాలెం, గుడ్లూరు-2 రైతు సేవ కేంద్రం పరిధి లోని గ్రామాల్లో మండల వ్యవసాయా ధికారి బి.రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్ర మం మంగళవారం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా రైతుల పొలాలను వ్యవసాయా ధికారులు పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంట మార్పిడి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పంట మార్పిడి వలన భూసారాన్ని పెంపొందించవచ్చని, గత సీజన్‌లో ఉన్నటువంటి తెగుళ్ళను మరుసటి సీజన్‌కు వ్యాపించకుండా నిరోధించవచ్చని, ఎక్కువ దిగుబడి సాధించవచ్చని, కావున రైతులు తప్పనిసరిగా పంట మార్పిడిని అవలంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సుధారాణి, సౌభాగ్యవతి, గ్రామ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## అపార్ నమోదు త్వరగా పూర్తి చేయండి



**కందుకూరు, నవంబర్ 19, ప్రభాతవార్త :** ఆటోమేటెట్ పర్మెనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను వేగవతం చేయాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరక్టర్ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణం లోని జిల్లా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో అపార్ ఐడీ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం జరపరాదన్నారు. అలాగే మండలంలోఅపార్ నమోదు తక్కువగా ఉన్న ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. అపార్ నమోదులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఆర్జేడి సూచించారు. అనంతరం ఆయా పాఠశాల్లోని పదో తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. అలా వచ్చినప్పుడే వారు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. అదే విధంగా ఆయా పాఠశాలల్లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్ధులకు అందిస్తున్న డిజిటల్ విద్య బోధన గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ ఎంవీ జానకిరామ్, ఎంఈఓలు కే.సుబ్బారెడ్డి, బి.అజయ్‌బాబు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## ఘనంగా కెనరా బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం



**లింగసముద్రం, నవంబర్ 19, ప్రభాతవార్త :** కెనరా బ్యాంకు 119వ వార్షికోత్సవాన్ని మండల కేంద్రమైన లింగసముద్రంలోని కెనరా బ్యాంకులో ఘనంగా నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ సీహెచ్ శేషగిరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బ్యాంకు వ్యవస్థా పకులు అమ్మెంబాల్ సుబ్బారావుపై చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మేనేజర్ శేషగిరి మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించ డంతో పాటు వారికి అవసరమైన అన్ని సేవలను త్వరితగతిన పూర్తి చేసి ఖాతాదారుల విశ్వాసాన్ని పొందుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శశాంక్ ఆఫీసర్లు శ్రీకాంత్, ఎన్.పార్వతి, క్యాషియర్, కే.మహేంద్ర, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

## శకునాలపల్లి, కృష్ణంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం




**ఉదయగిరి, నవంబర్19, ప్రభాతవార్త :** మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ కృష్ణంపల్లి, శకునాలపల్లి రైతు సేవా కేంద్రాలను సందర్శించి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనడం జరిగింది. వరి పొలాలను సందర్శించిన మండల వ్యవసాయాధికారి వరిలో కలుపు యాజమాన్యం, అధిక వర్షాలు పడ్డడం ద్వారా నిలబడినటువంటి నీరు బయటకు పంపడం వంటి చర్యలు గురించి తెలియజేయడం జరిగింది. ఇటీవల పడ్డటువంటి వర్షాల ద్వారా పంట నష్టం ఏమైనా జరిగిందా అని గమణించి సదరు రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా పంట నష్టం జరిగినట్లయితే మండల అధికారులకు తెలియపరచాలని తెలియజేయడం జరిగింది. వరిలో వచ్చేటువంటి కాండం తొలుచు పురుగు, ఆకు ముడతకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా తెలియజేశారు. జిల్లా వనరుల శాఖ నుండి ఈ శైలజ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో నీటి యాజమాన్యం కలుపు యాజమాన్యం ఎరువుల యాజమాన్యం, తెగుళ్ళ యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. వ్యవసాయాధికారి సూచన, సలహాల మేరకు రైతులకు పాటించి అధిక దిగుబడి రాబట్టాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణాధికారి పాల్గొన్నారు.

## ఉదయగిరిలో వరల్డ్ టాయిలెట్‌డే కార్యక్రమం



**ఉదయగిరి, నవంబర్ 19, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి పట్టణంలోని దళితవాడ పాఠశాల నందు ఎంఎడీఓ ఆధ్వర్యంలో కార్యాలయం నందు వరల్డ్ టాయిలెట్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ పిల్లలకు ఓల్డ్ టాయిలెట్ డే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు సీనియర్ నాయకుడు నవాజ్, ఎంఆర్ ఈఓపీఆర్డీ ఇన్‌ఛార్జ్ కరిముల్లా, హెడ్‌మాస్టర్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం



**ఉదయగిరి, నవంబర్ 19, ప్రభాతవార్త :** ఉదయగిరి పట్టణంలోని ఏఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.కిరణ్ అధ్యక్షతన మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రు సహాయ సహకారాలు ఎంతో అవసరం అన్నారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వస్తువుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెనుకబడిన విద్యార్థుల కొరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్స్ తదితరులు పాల్గొన్నారు.

## సంగం బ్యారేజిని సందర్శించిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం



**సంగం నవంబర్ 19 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సంగంలోని పెన్నా నది, బీరాపేరు వాగులను ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు పరిశీలించారు. వరదల సమయంలో ఎక్కువగా ప్రమాదా లు జరిగే ప్రాంతాలను ఈ బృందం పరిశీలించింది. రాబోయే సైక్లోన్‌లు దృష్టిలో పెట్టుకొని ముందస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వ హించారు. సైక్లోన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ ఏఇ వినయ్‌కుమార్, ఎఎస్‌ఐ, పోలీసులు, ఇరిగేషన్ సిబ్బంది తదితరులున్నారు.

## ఊపిరితిత్తులను రక్షించుకుందాం

**- మెడికవర్ వైద్యులు**

**నెల్లూరు, నవంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం :** ప్రస్తుతం వాతావరణం చాలా వరకు కలుషితమైపోయిందని, పెరిగిపోయిన కాలుష్యం, పొగ, మద్యం తదితర అలవాట్లక దూరంగా ఉండటం వల్ల ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పల్మనాలజిస్టు డాక్టర్ జీఎల్ లక్ష్మీ సుస్మితారెడ్డి, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ కౌశిక్ రెడ్డిలు తెలిపారు. ప్రపంచ సీఓపీడీ(క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నెల్లూరు బైపాస్ రోడ్డులోని మెడికవర్ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆ డాక్టర్లు మాట్లాడారు. ప్రధానంగా దీర్ఘకాలిక దగ్గు, ఊపిరి ఆడకపోవడం, అలసట ఈ వ్యాధి లక్షణాలన్నారు. దగ్గు, ఆయాసంతో బాధపడే అనేక మంది స్త్రీలు, పురుషులను తమ ఆసుపత్రిలో పరిశీలించామన్నారు. ఈ లక్షణాలున్న ఆపేషెంట్లను మొదట్లో పలువురు డాక్టర్లు వృద్ధాప్యంతో వచ్చిన లక్షణాలు, ఉబ్బసంగా భావించి మాత్రలు ఇచ్చి పంపుతున్నట్లు తెలిసిందన్నారు. అందువల్ల వారికి సీఓపీడి జబ్బు ముదిరి ఏ పనులు చేసుకోలని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి వారి ఊపిరితిత్తులను కొలిచే వాటి ఆరోగ్య పరిస్థితిని, ప్రాముఖ్యతను వివరించడానికే ప్రపంచ ఆరోగ్య సంస్థ పీడీ దినోత్సవాన్ని నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తోందన్నారు. స్త్రీ కన్నా పురుషుల్లో 10శాతం ఎక్కువగా ఈ జబ్బు వస్తుందన్నారు. నెల్లూరు జిల్లాలో దాదాపు112 శాతం మంది ఈ జబ్బుతో బాధపడుతున్నారన్నారు. 10 ఏళ్ళ పైబడి దగ్గు, అలసటతో ఉండే వారు తక్షణమే పల్మనాలజిస్టు వద్ద ఆరోగ్యం చెక్ చేయించుకుని మందులు వాడితే ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. సీవోపీడీ జబ్బును అంచనా వేసే అధునాతన స్పరోమెట్రి అమేజింగ్ పరికరాలు వెదకవల్లిలో ఉన్నాయన్నారు. వీటిని ఉపయోగించి ఆధునిక పద్దతులతో చికిత్స చేసి రోగులకు నయం చేస్తున్నామని వారు తెలిపారు.

## మోటారు సైకిల్ ఢీకొన్న లారీ



**ఉలవపాడు, నవంబర్ 19, ప్రభాతవార్త :** ఉత్తరప్రదేశ్ నుంచి చెన్నైకు వెళ్తున్న ఉల్లగడ్డలోడ్‌తో వెళ్తున్న లారీ ఉలవపాడు మండలంలోని మన్నేటికోట జంక్షన్ వద్దకు వచ్చే సరికి అక్కడ మలుపు తిరుగుతున్న మోటారు సైకిల్‌ను గుద్దినట్లు మోటారు సైకిల్ నడుపుతున్న కందుకూరు మండలం కంద్రా వారిపాలెం గ్రామానికి చెందిన దామచర్ల తిరుపతయ్య అతని భార్య దామచర్ల జ్యోతి అనువారు రోడ్డుపై పడిపోయినట్లు వారి ఇరువురికి రక్త గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ఉలవపాడు పోలీసు వారు వెంటనే బయలుదేరి రోడ్డు ప్రమాదం జరిగిన ప్రదేశ్ వద్దకు వెళ్లి రోడ్డుపై రక్తపు గాయాలతో పడి ఉన్న వారు ఇరువురిని 108 అంబులెన్స్ ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ కేసు ఉలవపాడు ఎస్సై అంకమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పికెపాడులో పొలం పిలుస్తోంది



**అనంతసాగరం, నవంబర్19ప్రభాతవార్త:** మండలంలోని సోమశివల , పడమటికంభంపాడు రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరినారు మడిలో చివరి వారంరోజులకు ముందు సెంటుకు 160గ్రాముల వంతున కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేయాలని తద్వారా నాటిన తర్వాత కాండం తొలుచు పురుగు కాకుండా 20రోజుల వరకు చూసుకోవచ్చన్నారు. ప్రధానంగా పొలంలో ఎరువుల వాడకం , జీవన ఎరువుల వాడకం గురించి వివరించారు. ఈకార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## గ్రంధాలయంలో రంగవల్లి పోటీలు



ఉలవపాడు, నవంబర్ 19, ప్రభాతవార్త : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో పాఠశాల బాలికలకు రంగవల్లి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 72 మంది బాలికలు హాజరైనట్లు గ్రంధపాలకుడు డి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ వారం రోజులుగా జరిపిన పోటీలలో గెలుపొందిన విజేతలకు రేపు ముగింపు వేడుకల్లో ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు తెలియజేశారు.

## ఊపందుకున్న రబీ సాగు



**ఉలవపాడు, నవంబర్ 19, ప్రభాతవార్త :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రబీ వరి సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కొన్ని గ్రామాల్లో దుక్కి సిద్ధం చేస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో వరికి నారుమడులు వేశారు. కొన్ని గ్రామాల్లో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. కరేడు గ్రామాల్లో నాట్లు వేస్తుండగా కృష్ణాపురం, భీమవరం, బద్దిపూడి, తదితర గ్రామాల్లో నారుమడులు పోస్తున్నారు. ఇప్పటికే అడపాదడపా కురిసిన వర్షాలతో పాటు నీళ్ల చెరువులకు చేరడంతో జలకళను సంతరించుకున్నాయి. ఇదే రీతిలో వర్షాలు కొనసాగితే పంటలు సాగు మరింత ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో సాగు చేస్తున్న వరి పైర్లకు ప్రస్తుత వర్షాలు ఊపిరిపోశాయి. గత పది రోజులుగా చినుకు లేకపోవడంతో వరి పైర్లు ఎండుముఖం పట్టాయి. సోమవారం నుంచి ప్రారంభమైన వర్షం వరి పైర్లు సాగు చేస్తున్న రైతులకు ఊరటనిచ్చింది. ఉలవపాడు మండలంలో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కరేడు, చాకిచెర్ల, చాగల్లు, ఉలవపాడు తదితర గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.

## ప్రతి ఒక్కరూ తెదేపాలో చేరండి- మాలకొండ మాజీ చైర్మన్



**వలేటివారిపాలెం నవంబరు 19, ప్రభాతవార్త :** సభ్యులకు బహుళ ప్రయోజనాలు కల్పిస్తున్న తెదేపా పార్టీలో ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకోవాలని తెదేపా సీనియర్ నేత మరియు మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహంస్వామి దేవాలయ కమిటి మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి అన్నారు. బుధవారం మండలంలోని చుండి గ్రామంలో మండల తెదేపా కోశాధికారి చెరువుపల్లి సాంబయ్య అధ్యక్షతన సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఈ సందర భంగా మాజీ చైర్మన్ మాల్యాద్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ముందు చూపుతో కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమం రూపకల్పన చేశారని అన్నారు. కేవలం రూ.100ల సభ్యత్వంతో రూ.5 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కలి ్పంచినట్లు తెలిపారు. ప్రమాదసమయంలోనూ, దురదృష్టవశాత్తు సంబవించిన అకాలమరణంలోనూ సభ్యుల కుటుంబానికి ఈ సభ్యత్వం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. అదేవిధంగా బడుగుబలహీన వర్గాల కార యకర్తలకు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ పలు నామినేటెడ్ పదవుల ఎంపికకు ఈ సభ్యత్వ సీనియారిటి తగిన ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. సాంబయ్య మాట్లాడుతూ స్దానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నూతన సభ్యత్వం పుచ్చుకోగా మరి కొందరు తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకున్నట్లు సాంబయ్య వివరించారు.

## సంగమేశ్వరుని సన్నిధిలో సహస్ర లింగార్చన



**సంగం నవంబర్ 19 ప్రభాతవార్త :** సంగం శివాలయంలో సహస్ర లింగార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. కార్తిక మాసం పురస్కరించుకొని సహస్ర లింగాలకు పూజలు చేశారు. శివలిం గానికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. పూజలు చేశారు. ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గోన్నారు.

## మహిళలకు ఆదర్శప్రాయురాలు మాజీప్రధాని ఇందిరాగాంధి



**కావలిరూరల్, నవంబర్19 ప్రభాతవార్త :** భారతీయమహిళలకు ఆదర్శప్రాయురాలు మాజీప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధి అని కావలి వెంగళరావునగర్ అర్బన్‌హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రమ్య తెలియచేశారు. కావలిపట్టణంలోని వెంగళరావు నగర్‌నందు ఉన్న ప్రభుత్వశాఖ గ్రంధాలయంలో 57వ జాతీయగ్రంధాలయ వారోత్సవాలసందర్భంగా మంగళవారం శాఖగ్రంధాలయ అధికారిణి యస్.సునీత ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధి 107వ జయంతి సందర్భంగా ఆమెచిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడారు. మాజీప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధి జయంతిని మహిళాదినోత్సవంగా నిర్వహించాలని తెలియచేశారు. ఆమె గరీబీ హటావో, బ్యాంకులజాతీయకరణ, నిరుపేదలకు సంక్షేమపథకాలు మరియు అలీనదేశాల శాంతినాయకురాలిగా ప్రపంచదేశాలలో కీర్తిప్రతిష్ఠలు గడించారని తెలియచేశారు. గ్రంధాలయ అధికారిణి యస్.సునీత మాట్లాడారు. యువత, విద్యార్థులు తరచుగా గ్రంధాలయాలను సందర్శించాలని కోరారు. భారతదేశానికి ధృఢమైన నాయకత్వాన్ని అందించిన వీరవనిత స్వర్గీయ ఇందిరాగాంధి అని కొనియాడారు. మరో అతిథి యం.మాలకొండారెడ్డి మాట్లాడారు. భారతదేశానికి రాజాభరణాల రద్దు, దేశప్రగతికి ఎనలేనిసేవలందించి విదేశాంగవిధానానికి వన్నెతెచ్చిన మహిళ స్వర్గీయ ఇందిరాగాంధి అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయసిబ్బంది దివ్వ, రాజేశ్వరి, పాఠశాల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టి కార్యాలయంలో ఘనగా స్వర్గీయ ఇందిరాగాంధి జయంతి



**కావలిరూరల్, నవంబర్19 ప్రభాతవార్త :** నెల్లూరుజిల్లా కాంగ్రెస్‌పార్టి ఆదేశాలమేరకు కావలినియోజకవర్గ కాంగ్రెస్‌పార్టి ఇన్‌చార్జి పొదలకూరి కళ్యాణ్ ఆధ్వర్యంలో మంగళవారం కావలినియోజకవర్గ కాంగ్రెస్‌పార్టి కార్యాలయంలో మాజీప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధి 107వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. కాంగ్రెస్‌పార్టి రాష్ట్ర మాజీఅధికారప్రతినిధి, జిల్లా కాంగ్రెస్‌పార్టి ఉపాధ్యక్షులు యల్.సురేష్‌బాబు ముఖ్యఅతిధిగా పాల్గొని మాజీప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధి పేద,బడుగు,బలహీనవర్గాలకు ఎనలేనిసేవలందించారని కొనియాడారు. ఆమె చేసిన త్యాగాలను కొనియాడి కార్యక్రమాన్ని జరిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టి బిసిసెల్ అధ్యక్షుడు కమలాపురి శ్రీనివాసగౌడ్, కావలిపట్టణ అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌బాష, ప్రధానకార్యదర్శి షేక్.రియాజ్, పట్టణ ఉపాధ్యక్షులు కుమ్మరిగుంట కిషోర్, పట్టణ ఎస్టిసెల్ అధ్యక్షులు పీరిగ శ్రీకాంత్, పట్టణ బిసిసెల్ అధ్యక్షులు కమలాపురి రామ్‌గౌడ్, ఎస్సీసెల్ అధ్యక్షులు కుందుర్తి దేవయ్య, కావలిరూరల్‌మండల అధ్యక్షులు తలకొండపాటి గురవయ్య, బోగోలుమండల అధ్యక్షులు కంచి వెంకటేశ్వర్లు, దగదర్తిమండల అధ్యక్షులు పైడి రవీంద్రబాబు, జిల్లా దళితమోర్చ అధ్యక్షులు తాటిపర్తి బాలు,కాంగ్రెస్‌పార్టినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థిపై దాడిచేసిన వారిని వెంటనే సస్పెండ్ చేయాలి



**కావలిరూరల్, నవంబర్19 ప్రభాతవార్త :** కలిగిరి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థిపై దాడిచేసినవారిని వెంటనే సస్పెండ్‌చేయాలని అఖిలభారత అంబేద్కర్‌సేన మరియు సమతసైనిక్‌దళ్ తీవ్రంగా ఖండించడం జరిగింది. వీరిఆధ్వర్యంలో మంగళవారం కావలి ఆర్డీఓకు వినతిపత్రం అందచేసి బాధ్యులను వెంటనే సస్పెండ్‌చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కలిగిరి అంబేద్కర్‌నగర్‌కు చెందిన విద్యార్థి కలిగిరి జిల్లాపరిషత్ పాఠశాలనందు పదవతరగతి చదువుతున్నాడని బాలలదినోత్సవ సందర్భంగా ఈనెల 14వతేది పాఠశాలనందు కల్చరర్‌ప్రోగ్రాం నిర్వహిస్తున్న క్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మన్నం శ్రీనివాసులు మైక్‌లో మాట్లాడుతుండగా విద్యార్థి అటుగారావడంతో మైక్‌వైర్ తగలడంతో మైక్‌పనిచేయలేదని ఆవేశంతో ఆ విద్యార్థిని రూమ్‌లోకి లాక్కొనివెళ్లి విచక్షణారహితంగా కొట్టి కాలుతోతన్నుతూ కులదూషణచేయడం జరిగిందని తెలియచేశారు. మరో 4నెలల్లో చివరిపరిక్షలు ఉండగా విద్యార్థి భవిష్యత్తును కాపాడాల్సిన ఉపాధ్యాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతోమాట్లాడి టి.సి ఇచ్చి పంపించడం జరిగిందని తెలియచేశారు. ఈ దుర్ఘటనను ఖండిస్తూ సంబంధితవారిని వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థి భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత అంబేద్కర్‌సేన, నెల్లూరుజిల్లా కన్వీనర్ మద్దెల శ్రీనివాసులు, కోకన్వీనర్ జడ్డా తిరుమల, సమతసైనిక్‌దళ్ జిల్లా కార్యదర్శి అనపల్లిరాజ్‌సుందర్, నియోజకవర్గ అధ్యక్షులు మంచాల ఉదయభాస్కర్, సింహాద్రి, కాకిశ్రీనివాసులు పాల్గొనడం జరిగింది.

## మద్యం బాటిళ్లను అధికరేట్లకు అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

**కావలి, నవంబర్19 ప్రభాతవార్త :** కావలి మున్సిపాలిటిపరిధిలోని ముసునూరు ఇందిరమ్మకాలని వాటర్‌ప్లాంట్ సమీపంలో ఎటువంటి అనుమతులులేకుండా మద్యంబాటిళ్లను అధికరేట్లకు అమ్ముతున్న వ్యక్తిని మంగళవారం కావలిరూరల్‌పోలీసులు అరెస్ట్‌చేశారు. కావలి రూరల్ సర్కిల్‌ఇన్స్‌పెక్టర్ రాజేశ్వరరావు ఆదేశాలమేరకు రూరల్ యస్ఐలు యం.బాజిబాబు, సిహెచ్.తిరుమలరెడ్డి, పోలీసుసిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బ్రహ్మానందంను అరెస్ట్‌చేశారు. చట్టవిరుద్ధంగా బ్రాందీషాపులనుండి మద్యంబాటిళ్లు తెచ్చుకుని అధికరేట్లకు అమ్ముతున్న సమాచారంమేరకు పోలీసులు పట్టుకుని అరెస్ట్‌చేశారు. అతనివద్దఉన్న తొమ్మిది క్వాటర్ బాటిళ్లను స్వాధీనంచేసుకున్నారు.

## మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కి ఘన నివాళులు



**జలదంకి, నవంబర్ 19, ప్రభాతవార్త :** భారత దేశ మహిళ తొలి ప్రధాని ఇందిరాగాంధీ కి మండల కేంద్రమైన జలదంకి శాఖ గ్రంధాలయంలో ఘన నివాళులు అర్పించారు. 57 వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా ఓ కార్యాక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా బండాగారి ఎం.విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళ దినోత్సవాన్ని పురష్కరించుకొని మాజీ ప్రధాని దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆమె జీవిత విశేషాలను పిల్లలకు వివరించి ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమములో విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఫార్సు మెరకే ఎరువులు వాడుకోవాలి



**కోవూరు, నవంబం19ప్రభాతవార్త :** వ్యవసాయం సాగు చేసే రైతులు ప్రస్తుతం తాము సాగు చేసే పంటలకు వ్యవసాయ శాఖ సూచించిన మేరకు ఎరువులు వాడుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అన్నారు. కోవూరు మండలం గంగవరం , జమ్మిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ఈ వ్యవసాయ సీజన్‌లో చేపట్టవలసిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాస్పేట్ ఎరువులు భూమిలో ఎక్కువైనప్పుడు నేల చౌడుభారిపోతుందన్నారు. దీని వలన జింక్ లోపం రావడం, వేసిన ఎరువులను పైరు తీసుకోకపోవడం జరుగుతుంది. ముఖ్యంగా పాస్పేట్ పోషకం ప్రతి కాంప్లెక్స్ ఎరువుల్లో ఉంటుందని, దీని వలన అధిక మోతాదులో పాస్పేట్ నేలకు చేరి నేల భూసార్వం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వాడుకోవాలన్నారు. పొటాష్‌ను తొలిదశలో కానీ, దుక్కిలో కానీ 20 కిలోలు వేసుకోవాలని , మిగతా సంగం 15 కిలోలు చిరుపుట దశలో వేసుకోవాలన్నారు. పురుగుమందులను అవసరం మేరకు వాడుకోవాలని ఎక్కువ సార్లు పిచికారి చేస్తే మిత్ర పురుగులు నశించి రైతులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, వ్యవసాయ సహాయకులు చాద్విక, పశు సహాయకులు శిరీష, తదితరులు ఉన్నారు.

## జాతీయ ఐక్యతా దినోత్సవం



**వింజమూరు, నవంబర్19ప్రభాతవార్త:** జాతీయ ఐక్యతాదినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వింజమూరులోని వైఆర్ జూని యర్ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా యువజన అధికారి ఎ.మహే ంద్రరెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాసులురెడ్డి, ఎంఇఒ మధుసూధన్‌రెడ్డి, కళాశాల ప్రిన్స్‌పాల్ పద్మనా భరావ్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా మహేంద్రరెడ్డి మాట్లాడుతూ త్వామి ఎక్తా దివాస్ జాతీయ సమైక్యతా దినోత్సవం అని కూడా పిలుస్తారన్నారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం నవంబర్19న ఐక్యతాదినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. భారతదేశ మొదటి ఏకైక మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఐక్యతాదినోత్సవంగా జరుపుకుంటారన్నారు. కుల, మత, భాషలతో సంబంధం లేకుండా ప్రజల మధ్య జాతీయ సమైక్యత, ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించడం జాతీయ సమైక్యతా దినోత్సవం లక్ష్యమన్నారు. భారతీయుల మధ్య ఐక్యత, సమగ్రత బంధాలను బలోపేతం చేయడం , దేశం వైవిధ్యం, బహుళత్వం పట్ల నిబద్ధతను పునరుద్ధరించడమన్నారు. అనంతరం స్వచ్ఛభారత్‌కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు తదితరులుపాల్గొన్నారు.

## చట్టపరమైన రక్షణలో సహాయ వ్యవస్థలపై అవగాహన



**ఆత్మకూరు, నవంబర్19ప్రభాతవార్త:** స్త్రీ,శిశు సంక్షేమ సాధికారత శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.హేనాసుజన్ ఆదేశాల మేరకు ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి. సునీలత ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నతపాఠశాలలో జిల్లాస్థాయి 100రోజుల ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ జిల్లాస్థాయి 100రోజుల ప్రత్యేక అవగాహనా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం బాలికల చదవుపట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని, వారి బంగా భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. అదేవిధంగా తమ పిల్లలకు తల్లిదండ్రులు చిన్నవయసులో వివాహాలు చేయడం వలన కలిగే అనర్థాలను తెలియజేసి వారికి అవగాహన పెంచాలన్నారు. అదే విధంగా కిషోరబాలికలు గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌ల గురించి తెలుసుకొని ఎవరైన తమను తాకినప్పుడు దాన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఇందుకు సమాజంలో జరుగుతున్న కొన్ని సంఘటనలు గురించి వివరించారు. వీటన్నింటి బాలికలు , తల్లిదండ్రులు ధైర్యంగా ఎదుర్కోవాలని , అందుకు చట్టపరమైన రక్షణ చట్టాలున్నాయన్నారు. ఇందుకోసం ప్రభుత్వం బేటి బచావో-బేటి పడావో , కిషోరవికాసం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తూ బాలికలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. సఖి వన్‌స్టాప్ సెంటర్అడ్మిన్ షేక్ షెహనాజ్ మాట్లాడుతూ మహిళలకు, పిల్లలకు అందుబాటులో చైల్డ్ అండ్ ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098,181,112 గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ ఆత్మకూరు సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ,కేస్ వర్కర్ ఎస్.శారద, పారామెడికల్ లీలావతి, స్కూల్ అసిస్టెంట్ ఇన్‌చార్జ్ హెచ్ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు , మోప్మా ఎఐ మాధవి,విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు పంపిణీ

**అనుమనముద్రంపేట,నవంబర్19ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండల కేంద్రంలోని ఠాగూర్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్ కరస్పాండెంట్ సి.హెచ్.వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ దొరస్వామిరెడ్డిల ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఇఒ డి.సాయిప్రసాద్ హాజరయ్యారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులను ఎంఇఒ సాయిప్రసాద్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహోన్నత వ్యక్తుల ఆశయాలను గుర్తించుకుంటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని , ఎల్లప్పుడూ విద్యార్థి ఆలోచన ఉన్నతమైనిగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏఎస్‌పేటలో కిషోరవికాస్ కార్యక్రమం



**అనుమనముద్రంపేట, నవంబర్19ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కిషోర వికాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె బాల్యవివాహాలను అరికట్టాలని , బాలికల విద్యను పెంచాలని , బాలికల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని తదితర అంశాల గురించి వివరించారు. బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తదితర విషయాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు హరికృష్ణ,ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ కార్యకర్తలు కె.విజయలక్ష్మి, సావిత్రి, సుశీల, షాకీర , విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించి డిప్యూటీ డిఇఒ



**మర్రిపాడు, నవంబర్19ప్రభాతవార్త:** మర్రిపాడు మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలను ఆత్మకూరు జిల్లా ఉప విద్యాశాఖాధికారి గోపాల్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తిలో నైపుణ్యాలను పెంపొందించుటలో భాగంగా ఈ సమావేశాలను నిర్వహిస్తున్నా మన్నారు. వీటిని ఉపాధ్యాయులందరూ చక్కగా వినియోగించుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని గోపాల్ కోరారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-1 జ్యోతి, ఎంఇఒ-2 ధనలక్ష్మి, మర్రిపాడు ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, రీసోర్స్ పర్సన్స్ రాజేంద్రకుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి



**మర్రిపాడు, నవంబర్19ప్రభాతవార్త:** పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు మెనూతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారులు జ్యోతి, ధనలక్ష్మిలు కోరారు. మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశంతో కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని వారు పరిశీలించారు. ఈకార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్స్, ప్రధానోపాధ్యాయులు పద్మలత, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లపై అలసత్వం వద్దు



**కోవూరు, నవంబం19ప్రభాతవార్త :** నెల్లూరు డివిజన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఇంటి పన్నులు, కుళాయి పన్నుల వసూళ్ల విషయంలో అలసత్వం లేకుండా ఇచ్చిన లక్ష్యాలు సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎల్‌పీవో డాక్టర్ పి. రమణయ్య అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు గ్రామ పంచాయతీలో మంగళవారం ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ డిసెంబర్ 31వ తేది నాటికి 50 శాతం పన్నులు వసూళ్ల కావాలన్నారు. మిగిలిన 50 శాతం మార్చి 31 తేది లోగా పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా అవసరమైతే వారిని సస్పెండ్ చేసేలా కూడా ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. పన్నులు సకాలంలో వసూళ్ల అయితేనే పంచాయతీలు అభివృద్ధి పథంలో పయనించేందుకు అవకాశం ఉంటుందన్నారు. నిర్లక్ష్యం వహించే వారిపై తగు చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అనంతరం పంచాయతీ పరిధిలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికకు వచ్చిన ఒక అర్జీకి సంబంధించి అర్జీదారునితో కలిసి సమస్యను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి హజరత్‌బాబు, తదితరులు ఉన్నారు.

## వైభవంగా అన్నాభిషేకం





**కోవూరు, నవంబం19ప్రభాతవార్త :** కోవూరులోని రైల్వే రోడ్డులో ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో మంగళవారం దేవస్థానంలో వేంచేసి ఉన్న శ్రీ విశ్వేశ్వర స్వామి పుట్టిన నక్షత్రం ఆరుద్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నందకిషోర్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అన్నాభిషేక కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉభయకర్తలుగా ఆలయ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు దంపతులు, ఉపాధ్యక్షులు సీహెచ్ వెంకటసుబ్బయ్య దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి సింగంశెట్టి రమేష్, కోశాధికారి మెంటా రమేష్‌బాబు, తదితరులు ఉన్నారు.

## యాక్సిక్ గ్రామీణ బ్యాంక్ చొరవ స్ఫూర్తిదాయకం



**కోవూరు, నవంబం19ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ బ్యాంక్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని విద్యార్థులకు కావాల్సిన కుర్చీలు, కార్పెట్‌లు అందజేయడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవో లక్ష్మిప్రసన్న తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీలోని అంగన్‌వాడీ సెక్టార్ కార్యాక్రమంలో భాగంగా వేగూరు పంచాయతీ పరిధిలోని సీతారామపురం అంగన్‌వాడీ కేంద్రానికి మంగళవారం ఈ బ్యాంక్ ఆధ్వర్యంలో కుర్చీలు, కార్పెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్ వసంత, తల్లిదండ్రులు, తదితరులు ఉన్నారు.

## మానస పాఠశాలలో విద్యార్దులకు వ్యాసరచన పోటీలు



**చేజర్ల నవంబర్ 19 ప్రభాతవార్త :** జాతీయ గ్రందాలయ వారోత్సవాలలో భాగంగా చేజర్లలోని మానస ప్రవేటు పాఠశాలలో విద్యార్దులకు వ్యాసరచన పోటీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మానస పాఠశాలలో విద్యార్దిని విద్యార్దులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గ్రంధాలయ వారోత్సవాలుపై విద్యార్దిని విద్యార్దులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రంధాలయాధికారిణి కల్పన,పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్దులు పాల్గోన్నారు.

## ప్రార్ధనామందిరాలకు భద్రతకు సహకరించండి



**బిట్రగుంట, నవంబర్19 ప్రభాతవార్త :** బోగోలుమండలంలోని క్రైస్తవ,ముస్లిం, హిందూ ప్రార్ధనామందిరాల్లో చోరీలను నివారించేందుకు పోలీసుశాఖకు నిర్వహణకమిటీలు సహకరించాలని బిట్రగుంట యస్ఐ.భోజ్యా తెలిపారు. బిట్రగుంట పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పి ఆదేశాలమేరకు ప్రార్ధనామందిరాల్లో తమశాఖ నిఘాతోపాటు కమిటీనికూడా చోరీలు జరగకుండా సి.సి కెమెరాల ఏర్పాటు లేదా కాపలాదారులను తప్పనిసరిగా నియమించుకుని సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఉత్సవాల నిర్వహణలో నగల భద్రత, హుండీలవద్ద నిఘానిపెట్టాలన్నారు.

## ఆర్‌యస్ఆర్‌లో ఘనంగా అంతర్జాతీయ పురుషుల దినోత్సవం



**బిట్రగుంట, నవంబర్19 ప్రభాతవార్త :** బోగోలుమండలం కడనూతల గ్రామంలోని ఆర్‌యస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగ ళవారం కంప్యూటర్‌సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ పురుషుల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ పివియస్.రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా జవహర్‌భారతి డిగ్రికళాశాల మాజీప్రిన్సిపల్ డాక్టర్ కె.రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో పురుషులపాత్ర అతిముఖ్యమైనదని కుటుంబంలోనూ పురుషులపాత్రే ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం పురష విద్యార్థులతో ర్యాంప్‌వాక్ నిర్వహించి బహుమతులను పంపిణిచేశారు. ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ టెక్ టైమ్స్ పేరుతో న్యూస్‌లెటర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## పొలంపిలుస్తుంది కార్యక్రమం



**బిట్రగుంట, నవంబర్19 ప్రభాతవార్త :** బోగోలుమండలంలో మంగళవారం యస్వీపాలెం, బోగోలు బిట్-2 గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి సహాయవ్యవసాయ సంచాలకులు సిహెచ్.నాగరాజు, మండల వ్యవసా యశాఖాధికారిణి యస్.విజయలక్ష్మి పాల్గొని రబీసీజన్‌లో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులగురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రం పరిశీలన



**వింజమూరు, నవంబర్19ప్రభాతవార్త:** వింజమూరు బాలుర ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్‌కేంద్రాన్ని ఎంపిడిఒ కె.శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. అపార్ ఆధార్ ఐడి విద్యార్థులకు పేరులో తప్పులు, పుట్టిన తేది, అడ్రస్ అన్నింటిని సరిచేస్తారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ మధుసూధన్‌రెడ్డి, హెచ్. ఎం మాలకొండయ్య, డిజిటల్ అసిస్టెంట్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## రంగవల్లుల పోటీలు



**వింజమూరు, నవంబర్19ప్రభాతవార్త:** వింజమూరు గ్రంథాలయం ఆధ్వర్యంలో మహిళలకు, విద్యార్థులకు రంగవల్లుల పోటీలు , అల్లికల పోటీలు నిర్వహించారు. మంగళవారం గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ సృజన హాజరయ్యారు. ముందుగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగంచేసుకొని ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. ఈకార్యక్రమంలో మద్దూరు రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపిడిఒ



**బిట్రగుంట, నవంబర్19ప్రభాతవార్త:** బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపిడిఒ ఇ.సుబ్రహ్మణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల సచివాలయ సిబ్బంది చేపట్టిన పలు సర్వేల గురించి వాటి పురోగతి గురించి తెలుసుకున్నారు.

## ఎరువులు వాడాలి దిగుబడులు పొందాలి ఏవో శ్రీలక్ష్మి




**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 19, ప్రభాతవార్త :** మండలం రామన్నపాలెం, ఆలూరుపాడు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని శ్రీలక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పొలంలో దుక్కిలో ఎకరాకు డిఏపి బస్తా, 25 నుంచి 30 కేజీలు యూరియా, 15 నుంచి 20 కేజీలు పొటాషియం వేసుకోవాలని సూచించారు. వరిలో వచ్చే కలుపు నివారణ మందుల కూడా వాడాలి అలాగే రైతులు రక్షక పంటలుగా ఆవాలు, బంతి మొక్కలు వేయడం వలన వాటి యొక్క ఆవశ్యకత తెలుసుకోవచ్చు అన్నారు. వరి నాటినప్పటి నుండి క్రమ పద్ధతిలో ఎరువులు, మందులు పిచికారి చేసి వాడినట్లయితే అధిక దిగుబడులతోపాటు ఆదాయం పొందవచ్చు అన్నారు. అనంతరం పశు వైద్య సిబ్బంది మాట్లాడుతూ పశువులలో వివిధ రకాల వ్యాక్సిన్లు, అమలవుతున్నాయి. ఆ పథకాలను తెలుసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకట్రావు, షేక్ బాషా, విపిఏ పృథ్వి, నిహారిక, సుప్రియ, హరినాథ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశంలో 8.50 లక్షల సహకార సొసైటీలున్నాయి

### జిల్లా సహకారశాఖాధికారి బి.గురప్ప






**బుచ్చి నవంబర్ 19 ప్రభాతవార్త** భారతదేశంలో అతిపెద్ద వ్యవస్థ సహకార వ్యవస్థ అని జిల్లా సహకారశాఖాధికారి బి.గురప్ప పేర్కున్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలలో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంలో దివవ్వేరు కో ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ నెం.కె.70 మరియు ది బుచ్చిరెడ్డిపాళెం కో ఆపరేటివ్ అగ్రికల్చరల్ క్రెటిట్ సొసైటీ లిమిటెడ్ నెం.కె.69 సంయుక్త నిర్వహించిన సహకార వారోత్సవాలలో ముఖ్య అతిధిగా పాల్గొన్నా సందర్బంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో వవ్వేరు మరియు బుచ్చిరెడ్డిపాళెం సహకార సంఘాలు నెంబర్ 1 స్దానంలో ఉన్నాయని ఆయన తెలిపారు. ఈనెల 14 వ తేది నుండి 20 వ తేది వరకు 71 వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం పరిసర ప్రాంతాలు చాలా ప్రసిద్ది పొందినవని తెలిపారు. ఈ ప్రాంతంలో సమసమాజానికి అంకురార్పణ జరిగిందని అన్నారు. పేదల అభ్యున్నతికోసం పాటు పడిన మహానీయులు బెజవాడ గోపాల్‌రెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, జక్కావెంకయ్య లాంటి మహనాయులు ఈప్రాంతం వారు అని ఆయన తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నుండి అనేక ఉద్యమాలు ప్రారంభం అయ్యాయని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమ కోసం వవ్వేరు, బుచ్చి రెండు సంఘాలను ఏర్పాటు చేశారని అన్నారు.

సహకార సంఘాలు నీతి నిజాయితీలు మానవతా విలువలతో కూడినవి అని ఆయన స్పష్టం చేశారు. 1864లో జర్మనీ నుండి ఈ సహకారసంఘాల వ్యవస్దను మనం తీసుకోవడం జరిగిందని తెలిపారు. 1904 భారతదేశంలో ఏర్పడ్డాయి. భారతదేశంలో 8.50 లక్షల సహకార సొసైటీలున్నాయి. 30 కోట్ల మంది ఈ సొసైటీ పరిధిలో ఉన్నారు. రైతులు అధిక వడ్డీలు భారిన పడకుండా ఈ సొసైటీలు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ప్రస్తుతం సొసైటీలను ఆధునీకరణ చేస్తు పూర్తి వివరాలు అందులో పొందు పరచడం జరిగిందని అన్నారు. రైతులందరు సహకారోద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈకార్యక్రమానికి సభాధ్యక్షులుగా పర్సన్ ఇన్‌చార్జి దివవ్వేరు కో అపరేటివ్ రూరల్ క్రెడిట్ సొసైటీ, సీనియర్ ఇనస్పెక్టర్ కట్టా సుబ్రహ్మణ్యం, పర్సన్ ఇన్‌చార్జి ది బుచ్చిరెడ్డిపాళెం కో ఆపరేటివ్ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ గున్నం నిర్మల, ముఖ్య అతిధిగా జిల్లా సహకారశాఖాధికారి బి.గురప్ప, విశిష్ట అతిధులుగా కె.తిరపతయ్య, జిల్లా సహకార శాఖాధికారి, కె యలమందరావు డివిజనల్ సహకార శాఖాధికారి కావలి, మం.వి సుభాషిణి సబ్ డివిజనల్ సహకార శాఖాధికారి కోవూరు, వ్యవహారించారు. కార్యక్రమ నిర్వాహకులుగా దివవ్వేరు కో ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ సొసైటీ ముఖ్య కార్య నిర్వహణాధికారి మన్నారపు శ్రీనివాసులు, దిబుచ్చిరెడ్డిపాళెం కో ఆపరేటివ్ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి కలికి సురేష్ కుమార్‌రెడ్డి వ్యవహారించారు. ఈకార్యక్రమంలో రైతులు, పాడుపు మహిలు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## భారతదేశ మొదటి మహిళాప్రధాని ఇందిరాగాంధి



**కావలి, నవంబర్19 ప్రభాతవార్త** భారతదేశానికి మొదటి మహిళాప్రధానమంత్రి ఇందిరాగాంధి రాజకీయ విప్లవాత్మకమార్పులు తీసుకొచ్చిన ఘనత ఆమెకేద క్కిందని కాంగ్రెస్‌పార్టినేత కుంతూరు శ్రీనివాసులు తెలిపారు. కావలి పొట్టిశ్రీ రాములు సెంటర్‌లోని పూలబజార్‌వద్ద మంగళవారం కాంగ్రెస్‌పార్టి వీరాభిమాని, భారత్ జూడో సైకిల్‌యాత్ర చేసిన కుంతూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇందిరాగాంధి జయంతి వేడుకలు ఘనంగాజరిగాయి. ఆయన కారుపై కేక్‌కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరాగాంధి 1917వ సంవత్సరం నవంబర్ 19న జన్మించారన్నారు. రాజకీయంగా విప్లవాత్మకమార్పులు తీసుకువచ్చి పేద, మధ్యతరగతి ప్రజలు ఆనందంగా జీవించేలా పాటుపడ్డారన్నారు. రిజర్వేషన్లద్వారా ఎంతోమందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు స్థలాలుఇచ్చి ఇల్లుకట్టించారన్నారు. ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలోయస్.కె.గౌస్‌బాష, యస్.కె.బాదుల్లా, షేక్.షన్ను, యస్.కె.మస్తాన్, యస్.కె.చాన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

## సురేంద్ర కుటుంబానికి అండగా ఉంటాం

**నెల్లూరు, నవంబర్ 19, ప్రభాతవార్త- వైద్యం** వైద్యశాలలో పదారుపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ నందు కాంట్రక్టు పద్దతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈఒ)గా పని చేస్తూ మృతి చెందిన గండికోట సురేంద్ర కుటుంబానికి అండగా ఉంటామని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకరరావు తెలిపారు. మంగళవారం స్థానిక జాకీర్ హుస్సేన్ నగర్‌లోని సురేంద్ర కుటుంబ సభ్యులను హంస నాయకులు పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. పేదరికంలో ఉన్న సురేంద్రకుటుంబానికి హంస ఆధ్వర్యంలో పలువురు డాక్టర్లు, వైద్య ఉద్యోగులు ఫోన్ పే ద్వారా సాయం అందించారు. ఈ సందర్భంగా హసం అధ్యక్షుడు సుధాకరరావు మాట్లాడుతూ సురేంద్ర కరోనా సమయంలో ప్రజలకు ఎంతో ధైర్యంగా సేవలందించారన్నారు. తన బాధ్యతలనే కాకుండా అందరి బాధ్యతలను భుజాన వేసుకుని పని చేసేవారన్నారు. అందరితో కలుపుగోలుగా తలలో నాలుకలా ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నాడన్నారు. అలాంటి సురేంద్ర పెళ్లైన సంవత్సరం లోపు మృతి చెందడం బాధాకరమన్నారు. ఆరు నెలల చిన్న పసిబిడ్డ, భార్య, ముసలి తల్లిదండ్రుల బాధ్యత చూసుకోవాల్సిన సురేంద్ర ఈ లోకాన్ని వీడటం తమను కలిచివేసిందన్నారు. వారి దీనావస్థను మృతుని కుఉంబ ఆర్థిక పరిస్థితిని చూసి కలెక్టర్ ఆనంద్, డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య ఆదుకోవాలని కోరారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో హంస జనరల్ సెక్రటరీ కమల్, కోశాదికారి మజయుల్లా, ఉపాధ్యక్షులు నాగరాజు, మురళి, గౌరవ సలహాదారులు పరియక మహేష్ కుమార్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ను ఢీ కొట్టిన 108 అంబులెన్స్



**కొడవలూరు(విడవలూరు), నవంబర్ 19, ప్రభాతవార్త** మండల కేంద్రం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా బైక్‌ను ఢీకొట్టిన సంఘటన కొడవలూరులో చోటు చేసుకుంది. స్థానిక వివరాలు ఇలా ఉన్నాయి హరిజనవాడకు చెందిన వెంపల రావమ్మ బైక్ పై వెళుతున్న సమయంలో వెనుక వైపు నుండి 108 అంబులెన్స్ ఢీకొనడంతో పడిపోవడం రావమ్మ పై వాహనం దూసుకుపోయింది. క్షతగాత్రురాలును 108 ద్వారా నెల్లూరు వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పుస్తకాలు విజ్ఞానా నిధులు

### బెజవాడ నరేష్ చంద్రారెడ్డి



**బుచ్చి నవంబర్ 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో 57 వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల సందర్బంగా పాఠశాల గ్రంధాలయంలోని పుస్తకాల ప్రదర్శనను నెల్లూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు బెజవాడ నరేష్ చంద్రారెడ్డి ప్రారంబించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు నేటి ఆధునిక యుగంలో పుస్తకాలను చదవడం మరిచిపోతే జాతికి ప్రమాదం అని అన్నారు. పుస్తక పఠనం



ఎంతో ఆరోగ్యకరమని అన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు సెల్‌పోన్‌కి అంకితమైపోయారని ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. పుస్తక చదవడం అనేది జ్ఞాపకశక్తికి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. విద్యార్థులు చిన్న తనం నుండి గ్రంధాలయాలకు వెళ్ళడం పుస్తకాలు, దిన పత్రికలు చదవాలని ద్వారా వారిలో విజ్ఞానం పెరుగుతుందని అన్నారు. ఈ సందర్బంగా కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్ మాట్లాడుతు మా పాఠశాలలో అనేక సంవత్సరాల నుండి గ్రంధాలయ వారోత్సవాలు, సైన్స్‌డే నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. 1300 వందల పుస్తకాలు ప్రదర్శనకు పెట్టినట్లు ఆయన తెలిపారు. 21 వ తేది వరకు ఈ పుస్తక ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిఫల్ సురేఖ, ఉపాధ్యాయులు ఆమని, గిరిజ, అనిత, విజయలక్ష్మీ, వెంకటలక్ష్మీ విద్యార్దులు పాల్గొన్నారు.

## శ్రీచాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న

### నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



**ఇందుకూరుపేట, నవంబర్19, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో వెలసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శక్తిపీఠమైన శ్రీ చాముండేశ్వరి అమ్మవారిని ఉడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయబోతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండూరు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవస్థానంక కార్యనిర్వహణ అధికారి తాతా శ్రీనివాసరావు, పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి వద్ద పూజా కార్యక్రమాలు అనిల్ శర్మ, రామకృష్ణ స్వామి నిర్వహించి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రసాద పంపిణీ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అమ్మవారికి మొక్కు తీర్చుకోవడానికి వచ్చానని, అలాగే కోనేరుకు ఘాట్ కూడా ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చారు. జనవరిలో అమ్మవారి కుంభాభిషేకానికి కూడా వస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కుదురు చంద్రారెడ్డి దగ్గరుండి పర్యవేక్షించగా, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కొండూరు వెంకటరమణారెడ్డి, కృష్ణచైతన్య, కృష్ణారెడ్డి, బొద్దుకూరు సుధీర్, దుగ్గా శంకర్‌రెడ్డి, వెంకయ్య, మల్లిఖార్జునరెడ్డి, బీజేపీ నాయకులు కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, జనసేన నాయకులు మోహన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం

### - ఈనెల 21న ప్రమాణ స్వీకారం



**నెల్లూరు, నవంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం** జిల్లాలోని ప్రతి మారుమూల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని నెల్లూరు జిల్లా ఆర్టీసీ రీజనల్ జోనల్ చైర్మన్, భారతీయ జనతా పార్టీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని రామ్మూర్తి నగర్‌లో ఉన్న బీజేపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కొన్ని శాఖలకు మాత్రమే నిధులను విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలను చాలా వరకు జగన్‌మోహన్‌రెడ్డి నిర్వీర్యం చేశాడని ఆరోపించాడు. రాష్ట్రంలో రోడ్లను మరమ్మత్తులు చేయకుండి విస్మరించడంతో ఆర్టీసీకి ఎంతో నష్టం వాటిల్లిందన్నారు. రోడ్లు సక్రమంగా లేకపోవడంతో వ్యాపారులు, ప్రజలు, ఆర్టీసీ కూడా ఆర్థికంగా నష్టపోయింద న్నారు. ఆర్టీసీలో ఉన్న ఉద్యోగులు కార్మికులు పెన్షనర్ల సమస్యలను పరిష్క రించేందుకు ఏ నాడు గత ప్రభుత్వం కృషి చేయలేదన్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు నా శాయశక్తుల పని చేస్తానన్నారు. అలాగే లక్షలాది ప్రయాణి కులకుమేరుగైన సౌకర్యాలను అందించేందుకు ప్రయత్నిస్తానని ఆయన తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న ఈనాటికి కూడా ఈ జిల్లాలో పలు ప్రాం తాలకి బస్సు సౌకర్యాలు లేవన్నాడు. అలాంటి గ్రామాలకు కూడా నా అనుభవంతో జిల్లా మంత్రులైన పొంగూరు నారాయణ ఆనం రామనా రాయణరెడ్డిలతో పాటు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధ ర్‌రెడ్డిలు ఇతర ఎమ్మెల్యేలతో కలిసి, వాళ్ల సలహాలు సూచనలతో ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం ఉండేలా చూస్తామన్నారు. గ్రామాలకి కొత్త బస్సుల రూపకల్పనకు స్వ చ్ఛంద సంస్థలు, దాతలు, సీఎస్ఆర్ నిధులతో ఆర్టీసీని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు. ఈనెల 21న ఈ జిల్లా రీజనల్ కేంద్రమైన నెల్లూరు బస్టాం డ్‌లో నా మిత్రుడైన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రమా ణ స్వీకారం చేయనున్నానని, ఈ కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణ, మాజీ వైద్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, వేములపాటి అజయ్, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. ఆర్టీసీ అభ్యున్నతికి, ఉద్యోగులు, కార్మికులు, సమస్యల పరిష్కారానికి, నాకు పరిచయం ఉన్న కేంద్ర మంత్రులు మాజీ మంత్రులతో సహ ఇక్కడికి తీసుకొని వచ్చి వారి సహాయ సహకారాలతో శక్తి వంచన లేకుండా అభివృద్ధికి తోడ్పాటు నందిస్తానన్నారు. నన్ను వరించిన ఈ పదవి బీజేపీలో కార్యకర్తలకు ఇస్తున్న గౌరవానికి నిదర్శనం అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి, వంశీధర్‌రెడ్డి, మిడత రమేష్, యర్రబోలు రాజేష్, కందికట్ల రాజేశ్వరి, బైరి శ్రీనివాసులు, మొగరాల సురేష్, మండలన ఈశ్వరయ్య, గడ్డం విజయ కుమార్, చిలక ప్రవీణ్‌కుమార్, కరణం భాస్కర్, సునీల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, యాకసిరి ఫణిరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ ఎన్ హెచ్ డబ్ల్యు, డబ్ల్యూ ఏ ఎస్ హెచ్ పై

### శిక్షణ కార్యక్రమం




**నెల్లూరు అర్బన్ నవంబర్ 19 ప్రభాతవార్త** మంగళవారం డిఆర్డిఏ కాన్ఫరెన్స్ హాల్లో ఎఫ్‌ఎన్‌హెచ్‌డబ్ల్యూ, వాష్ కార్యక్రమాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డైరెక్టర్ నాగరాజుకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. పై కార్యక్రమంలో శానిటేషన్, హైజానిక్ గురించి వివరించారు. పరిసరాల ప్రాముఖ్యత, నీటి యొక్క కలుషిత నీరు వలన ఎలాంటి రోగాలతో బారిన పడవచ్చు మిగతా విషయాలపై సూచించారు. డి ఎం హెచ్ ఓ కార్యాలయం నుండి డాక్టర్ వినూత్న కార్యక్రమానికి హాజరై మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎటువంటి ఆహారం తీసుకోవాలి అన్న విషయం పై వివరించారు. ఈ కార్యక్రమానికి ఏసీలు, ఏపీఎంలు ప్రతి మండలం నుండి హాజరైయ్యారు.

## గురుకులంకు త్రాగునీరు సరఫరా



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 19, ప్రభాతవార్త** మండలం చంద్ర శేఖరపురంలో ఉన్న ఏకవల్య గురుకుల పాఠశాలలో త్రాగు నీరు కలుషితం అవడంతో స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పై అధికారుల ఆదేశాలమేరకు త్రా గునీరు సరఫరా చేయడం జరిగిందని ఎంపీడీవో సుబ్బారావు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు మూడు రోజుల నుండి తాగునీటి కలుషితంతో వాటిని తాగడంతో అనారోగ్యానికి గురైనారు. ఇప్పటికే పంచాయతీ నుండి మూడు ట్యాంకర్ల త్రాగునీరు జరిగిందని తెలిపారు. ఫోటో

## విద్యార్థుల పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్నాం

### డిఎం అండ్ హెచ్ఓ



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 19, ప్రభాతవార్త** చంద్రశేఖరపురం గ్రామపంచాయతీలో ఉన్న ఏకవల్య గురుకుల పాఠశాల విద్యార్థి విద్యార్థులు మూడు రోజుల నుండి అనారోగ్యానికి లోనయ్యారని డిఎంఅండ్ హెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య సిబ్బందితో విద్యార్థులకువైద్య చికిత్స అందించడం జరుగుతుంది. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం తగిన జాగ్రత్తలతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## మాదకద్రవ్యాల వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలి




**కోవూరు, నవంబం19ప్రభాతవార్త** : యువత మాదకద్రవ్యాల వినియోగం వైపు దృష్టి పెట్టకుండా తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు రావాలని ఎక్సైజ్ సీఐ కిషోర్ అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని నేతాజీనగర్‌లో ఉన్న వైకెఆర్అండ్‌కే ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో మంగళవారం మాదకద్రవ్యాల వినియోగం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఈ మాదకద్రవ్యాలపై యువత దృష్టి పెడుతున్నారని, అది వారి భావ్య జీవితానికి గొడ్డలిపెట్టు లాంటిదన్నారు. వాటికి బానిసైన వారు రోజురోజుకూ దిగజారిపోయి విలువలను కోల్పోతారన్నారు. ఎక్కడైనా ఇటువంటి మాదకద్రవ్యాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ మాట్లాడుతూ ఈ మాదకద్రవ్యాల వలన యువత చెడుదారిన పయనిస్తారన్నారు. ఇటువంటి చెడు అలవాట్లకు లోను కాకుండా సన్మార్గంలో నడవాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వీడియో ద్వారా ఈ మాదకద్రవ్యాల వలన ఎటువంటి దుష్పలితాలు వస్తాయో విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్ ప్రసాద్, ఎక్సైజ్ ఎస్సై మహబూబ్ బాషా, డాక్టర్ వంశీ కృష్ణ, తదితరులు ఉన్నారు.

## మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయాన్ని తనిఖీ

### చేసిన ఆత్మకూరు డివిజనల్ విద్యాశాఖాధికారి



**ఉదయగిరి, నవంబర్ 19, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి మం డల విద్యాశాఖాధికారి వారి కార్యాలయంను ఆత్మకూరు డివిజన్ ఉప విద్యా శా ఖాధికారి గోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉదయగిరి మండల విద్యా శాఖాధికారి-2 తోట శ్రీనివాసులు మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయ సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, రికార్డ్స్ కార్యాలయానికి సంబంధించిన అన్ని రికార్డ్స్, రిజిస్టర్స్ ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గోపాల్‌కి చూపించి తనిఖీ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయ సిబ్బంది, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, నవంబరు19 ప్రభాతవార్త** : కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీ రాంజనే యస్వామి దేవస్థానంలో కార్తీక మాస మంగళవారం పర్వ దినాన్ని పురస్క రించుకుని ఆలయ ప్రధాన అర్చకులు నాగరా జాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయంలో పల్లకి సేవ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వ హించారు. రుత్వికులు సుబ్బయ్యస్వామి, నందకుమార్ స్వామి, ఫణికుమార్ స్వామి, తదితరులు భక్తులు ఉన్నారు.

## మర్రిపాడులో ఉపాదిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

### సుమారు 1.40లక్షల రూపాయలు రికవరీ




మర్రిపాడు, నవంబర్19ప్రభాతవార్త: మర్రిపాడు మండల కేంద్రంలో మంగళవారం మహాత్మగాంధీ జాతీయ ఉపాదిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిం చారు. జిల్లా నీటినిర్వహణా సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మండలంలోని 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 11.26కోట్ల రూపాయల విలువైన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాది హామీ పనులకు సంబంధించి సుమారు 9కోట్ల రూపాయల విలువైన పనులు ఇరిగేషన్, పంచాయతీరాజ్‌లకు సంబంధించి 2.21కోట్ల రూపాయల విలువైన పనులపై తనిఖీ నిర్వహించారు. గత రెండు వారాలుగా సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలన చేసి నివేదికను సమర్పించారు. ఈ నివేదికల ఆధారంగా సామాజిక ప్రజా వేదికలో 24పంచాయతీలకు సంబంధించి ఉపాదిహామీ పథకానికి సంబంధించి 86,326రూపాయలు, పంచాయతీరాజ్ శాఖ సంబంధించి 53,700రూపాయల నిధులు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఈనిధుల రికవరీకి అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈకార్యక్రమంలో 16వ విడత జరిగిన ఈ సామాజిక తనిఖీ కార్యక్రమంలో డ్వామా క్యాసిడిఇ సతీష్‌బాబు, అంబుట్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎపిడి శంకరనారాయణ, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎస్ఆర్‌పి నీలకంఠం, ఎంపిడిఒ నాగేంద్రప్రసాద్, ఎస్ఐ శ్రీనివాసరావ్, ఎపిఒలు వెంకటనారాయణ, సునీల్ తదితరులుపాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ లోపించిన పారిశుధ్యం



**బిట్రగుంట, నవంబర్19ప్రభాతవార్త:** బోగోలు మండలం అల్లెమడుగు అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పారిశుధ్యం లోపించడంతో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులకు అంటువ్యాధులు ఎక్కడ ప్రబలుతాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపునీరు నిల్వ ఉండడంతో కనీసం పారిశుధ్య పనులు ప్రజా ప్రతినిధులు, పాలకులు పట్టించుకొనకుండా బ్లీచింగ్ సైతం చల్లకపోవడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతోంది. తక్షణమే ఈ సమస్యపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నిధులు సక్రమంగా వినియోగించుకోవాలి



కోవూరు, నవంబం19ప్రభాతవార్త : పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సకాలంలో వినియోగించుకుని పాఠశాల అభివృద్ధికి దోహద ఎడాలని మండల విద్యాశాఖ అధికారి రహీమ్ తెలిపారు. కోవూరులోని పీఆర్ఎన్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో మంగళవారం కాంప్లెక్స్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన నిధులను నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి ఖర్చు పెట్టేలా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం అపార్ సంబంధించి కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసే కార్యక్రమం జరుగుతుందని, దీనిని మరింత వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అదేవిధంగా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ఉపాధ్యాయులు తగు చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మారుతున్న కాలానికి అనుగుణంగా కృత్యంతర భోదనపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి -2 చెంచులక్ష్మమ్మ, కోర్సు డైరెక్టర్లు పలు సూచనలు చేశారు.

## పీఎం సూర్యఘర్ ముక్తి పథకాన్ని

### సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, నవంబం19ప్రభాతవార్త :** ప్రభుత్వం సబ్సిడీతో గృహాలకు ఇంటి కప్పు మీద సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకునేందుకు పీఎం సూర్యఘర్ ముక్తి యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీనిని గృహ వినియోగదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీరు వి. విజయన్ తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడులోని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఈ పథకం ద్వారా లబ్ది పొందేందుకు ట్రాన్స్‌కో శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగిందన్నారు. గృహ వినియోగదారులకు ప్రభుత్వం సోలార్ రూఫ్‌టాప్ ఒక కిలో వాట్ నెలకు 120 యూనిట్ల చొప్పున వినియోగదారునికి ఏడాదికి 8 వేల రూపాయలు , రెండు కిలో వాట్లకు నెలకు 240 యూనిట్ల చొప్పున వినియోగదారులకు ఏడాదికి 20 వేలు, 3 కిలో వాట్లకు నెలలకు 360 యూనిట్ల చొప్పున ఏడాదికి 32,400 ఆదా అవుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకుంటే 30 వేలు, 2 కిలో వాట్లకు 60 వేలు, 3 కిలోవాట్లకు 78 వేలు సబ్సిడీద్వారా అందిస్తుందన్నారు. ప్రభుత్వం రాయితీ ద్వారా ఈ సోలార్ ప్లాంట్‌ను గృహ వినియోగదారులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాల మీద ఈ సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం స్మార్ట్ మీటర్లను జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వం కార్యాలయాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే వ్యవసాయ మోటార్లకు మాత్రం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం జరగదని ఇది వరకే విద్యుత్ శాఖా మంత్రి కూడా ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. 200 మీటర్లు వినియోగం దాటిన వినియోగదారులకు సంబంధించిన గృహాలకు కూడా ఈ స్మార్ట్ మీటర్లు దశలవారీగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ స్మార్ట్ మీటర్లను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామని, దీని వలన వినియోగదారునికి ఎన్నో ఉపయోగాలు కూడా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమేష్ చౌదరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మధుసూదన్‌రెడ్డిలు ఉన్నారు.